క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: కర్ణాటక నుంచి హిందూపురం మండలం కెంచనపల్లి మీదుగా పట్టణానికి కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు సెబ్ అధికారులకు సమాచారం అందడంతో శనివారం సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ కిరికెర వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. హిందూపురం పట్టణం అంబేడ్కర్ నగర్‌కు చెందిన నవీన్ స్కూటర్‌లో మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి 10 బాక్సులు (960 కర్ణాటకకు చెందిన హైవార్డ్స్ చీర్స్ విస్కా టెట్రా ప్యాకెట్లు), వాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి నవీన్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు కమలాకర్, సిబ్బంది ప్రకాష్, రమణ, వెంకటేశం, ఆంజనేయులు పాల్గొన్నారు.

తల్లి పాలు శ్రేష్ఠం



మాట్లాడుతున్న సీడీపీఓ సునీత

పావగడ: పుట్టిన పిల్లలు ఎదగడానికి తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని సీడీపీఓ సునీత సూచించారు. తాలూకాలోని ముగదాళబెట్ట గ్రామం అంగనవాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలన్నారు. ముర్రు పాలలో ఎన్నో పోషకాంశాలుంటాయని, బిడ్డల ఎదుగుదలకు ఎంతో సహకరిస్తాయన్నారు. అనంతరం బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పరమేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

మడకశిర: పట్టణంలోని కేపీ ప్రాథమిక పాఠశాలలో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు పాఠశాల ఎదుట జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హరిక్రిష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, మండల అధ్యక్ష కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప తదితరులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

సోమందేపల్లి: తప్పుడు కులధ్రువీకరణ పత్రాలను సమర్పించి ప్రభుత్వ పథకాలు పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు నరసింహమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పోలేపల్లి గ్రామంలో యలమ కులానికి చెందిన కొందరు కొంతకాలంగా అధికారుల నుంచి ఎస్టీ, బీసీలుగా కులధ్రువీకరణ పత్రాలు పొందారన్నారు. దీంతో అధికారులు కూడా వారికి సహకరించడంతో నిజమైన బీసీ, ఎస్టీ లకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈనెల 6న ఫిర్యాదు చేయగా విచారణకు లోకాయుక్త స్వీకరించినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

పెనుకొండ రూరల్: గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు, వడిత్యా శంకర్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా భోజన వసతి, తరగతి గది,వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. మౌలిక వసతులపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ పాఠశాలలో బోధన సిబ్బంది కొరత ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గురుకులాల్లో ఉండాల్సిన సదుపాయాలను ఇక్కడ కల్పించలేదన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సెటిల్మెంట్లకు అడ్డాగా చిలమత్తూరు పీఎస్

- 'ద్వితీయ' స్థాయి అధికారి కనుసన్నల్లో ఇష్టారాజ్యం
- జోరుగా ఇసుక, మట్టి, మద్యం రవాణా
- అక్రమార్కుల నుంచి వసూళ్లు !
- పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు





గత నెల 5వ తేదీన పోలీస్ స్టేషన్ వద్ద చర్యలు తీసుకోకుండా వదిలివేసిన ఇసుక ట్రాక్టర్ (ఫైల్), చిలమత్తూరు పోలీస్ స్టేషన్

చిలమత్తూరు: మండల కేంద్రంలో ఉన్న పోలీసుస్టేషన్ సెటిల్‌మెంట్‌లకు అడ్డాగా మారింది. పోలీసు స్టేషన్‌కు ఎస్ఐ లేకపోవడంతో ఇక్కడ పనిచేసే తర్వాత స్థాయి అధికారి అన్ని వ్యవహారాలు చూసుకుంటున్నారు. మండలం కర్ణాటక సరిహద్దులో ఉంది. దీనికితోడు జాతీయ రహదారులు ఉండటంతో అక్రమ రవాణాకు అడ్డాగా మారిపోయింది.

స్టేషన్‌కు నామమాత్రంగా..

ఇటీవల మండల పరిధిలో అక్రమంగా మట్టి, ఇసుక, మద్యం రవాణా జోరుగా సాగుతోంది. తనిఖీల్లో ఎవరైనా పట్టుబడినా నామమాత్రంగా స్టేషన్‌ను తీసుకొస్తూ ఏ కేసూ లేకుండా పంపించి వేయడం పరిపాటిగా మారిపోయిందన్న ఆరోపణలున్నాయి. గత నెల 5వ తేదీన రెండు ఇసుక ట్రాక్టర్లను చిలమత్తూరు పీఎస్‌కు తీసుకువచ్చారు. అయితే దానిపై ఇంత ఎలాంటి కేసూ నమోదు చేయకుండా వదిలేశారు. అలాగే మట్టి అక్రమ రవాణాలో కొడికొండకు చెందిన జేసీబీని స్టేషన్‌కు తీసుకువచ్చినా ఎలాంటి చర్యలూ తీసుకోకుండా వదిలేశారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు ఎన్నో కేసులను ఫైల్ చేయకుండా సెటిల్‌మెంట్‌లతో మమ అనిపించి సొమ్ముచేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఏ వ్యవహారాన్నైనా చిటికెలో సెటిల్‌మెంట్ చేసేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు గాలికి...

అక్రమ రవాణాపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలున్నప్పటికీ ఎస్ఐ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ ఎవరికీ మూడోకంటికి తెలీకుండా అక్రమార్కులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీన్నే అదునుగా చేసుకున్న అక్రమార్కులు ముందస్తుగానే అందించాల్సి మొత్తాన్ని అందిస్తూ పట్టపగలే సాఫీగా రవాణా సాగించేస్తున్నారు. ఉన్నతాధికారుల కన్ను పడకుండా అరకొరగా కేసులు నమోదు చేయడం, వాటికీ నామమాత్రపు అపరాధరుసుం కట్టించుకోవడం, వదిలేయడం పరిపాటిగా మారిపోయిందంటున్నారు.

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం..

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. అక్రమ మద్యం రవాణాపై నిషేధం ఉన్నా అక్రమార్కులకు చిన్నబాసు అండదండలు ఉండటంతో రోజూవారి అక్రమ మద్యం కార్యకలాపాలు యథాతథంగా సాగిపోతున్నాయని చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవపోవడంతో స్టేషన్ అస్తవ్యస్తంగా మారిందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చిలమత్తూరు స్టేషన్‌లో చిన్నబాసు అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నూతన ఎస్‌ఐని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో పురోహితులు గంగపూజ, గోపూజ, విగ్రహాల సంప్రోక్షణ, కలశాలతో ఆలయ ప్రదక్షిణ, యోగశాల ప్రవేశం, గణపతి పూజ, అంకురార్పణ, హోమాలు, బలి పీఠస్థాపనం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. కమిటీ తరుపున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం గంగపూజ, ఆలయ ప్రవేశం, పుణ్యనదీ తీర్థ స్నానం, అగ్ని ప్రతిష్టాపన, కళశస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వీరశైవ లింగాయిత్ శివాలయ సేవా కమిటీ సభ్యులు తెలిపారు.

మాజీ వలంటీర్ మృతి



నాగరాజు (ఫైల్)

గుడిబండ: మండలంలోని గుణే మోరబాగల్ గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ నాగరాజు (34) అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకుడు నాగరాజు తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపీటీసీ సభ్యుడు పాతలింగప్ప, నాయకులు నాగరాజుగుప్త, గుడ్డదహళ్లి నాగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు

హిందూపురం టౌన్: హిందూపురం విద్యుత్ డివిజనల్ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపై తక్షణం విచారణ జరపాలి. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో రాజకీయ పార్టీల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం డివిజన్ పరిధిలో హిందూపురం అర్బన్, రూరల్, మడకశిర, పెనుగొండ అన్ని ప్రాంతంలోనూ డివిజనల్ ఇంజినీర్ భూపతి డివిజన్ స్థాయిలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై సంపూర్ణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. వీరికి సహకరించని అధికారులను వేధిస్తున్నారని తెలిపారు. ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లకు అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ఉన్నతస్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకపోతే సోమవారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ శ్యామ్ కిరణ్, బీఎస్పీ పార్టీ శ్రీరాములు, ఆర్‌సీపీ పార్టీ శ్రీనివాసులు, ఎంఐఎం పార్టీ మున్నా, ఏపీఆర్ఎస్‌పీ నౌషాద్, దళిత సమైక్య నాయకులు నారాయణ, హరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవాలు



జ్యోతులతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి నర్సేగౌడ్, సమన్వయకర్త ఈరలక్కప్ప

అగళి: మండలంలోని కరిదాసనపల్లి, కోడిపల్లిలో రావుడి ఆంజనేయస్వామి, ఆంజనేయస్వామికి మాధూడి, కరిరేపల్లి, కరిదాసనపల్లి, కోడిపల్లి గ్రామస్తులు శనివారం జ్యోతుల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు జ్యోతులను మేళతాళాలు, వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి అర్పించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను వివిధ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పత్తి మొక్కల నరికివేత



పత్తి మొక్కలను చూపుతున్న మహిళలు

అగళి: మండలంలోని పీ బ్యాడగేర పంచాయతీ పరిధిలో ఉన్న కెంకర్ గ్రామంలో రైతు నరసింహరాజు పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి పత్తి మొక్కలను నరికి వేశారు. రైతు ఎకరా పొలంలో పత్తి పంట సాగు చశాడు. పంట చేతికి అందే సమయంలో గుర్తుతెలియని దుండగులు శుక్రవారం రాత్రి పత్తి మొక్కలను నాశనం చేశారు. రూ.1.50 లక్షల వరకు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. రైతు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం: పట్టణంలోని సూగూరు సడ్లపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ శనివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. అలాగే సీహెచ్ వెంకట రెడ్డి సిరి కల్చర్ రూ.10,116లు, రామిరెడ్డి రూ.15,116, నాగరాజు రూ.15,116, జ్యోష్ణ రూ.10,116, లైన్ మెన్ నాగరాజు రూ.10,116 చొప్పున విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. 500 సంవత్సరాల క్రితం వ్యాసరాయల మహర్షి చేతుల మీదుగా ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించినట్లు పూర్వీకులు చెబుతుంటారన్నారు. శ్రావణ శనివారం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రమోద్ కుమార్, శివారెడ్డి, శ్యామ్ రావు, రాజశేఖర్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, లింగా రెడ్డి, రామప్ప, కేశవరెడ్డి, రాందాస్, తిమ్మారెడ్డి, అశోక్ రెడ్డి, సంజీవప్ప, సోమశేఖర్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలి



సీఎండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

హిందూపురం టౌన్: దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదా కొనసాగించాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ కోరారు. శనివారం స్థానిక సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో భారత క్రైస్తవుల నిరసన దినం–బ్లాక్‌డే చేపట్టారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మతం మారినా, కులం మారిన వారి సామాజిక స్థితి మారదన్నారు. ప్రతి పౌరుడికి తమకు నచ్చిన మతం స్వీకరించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. సామాజిక అసమానతలను రేపిన 1950 ఆగస్టు 10న వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మూడవ పేరాను రద్దు చేయాలని కోరారు. మత స్వేచ్ఛ హక్కు, సమానత్వపు హక్కును ప్రతి పౌరుడు సంపూర్ణగా అనుభవించే వాతావరణం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్స్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, కార్యదర్శి సాల్మన్ రాజ్, పాస్టర్ స్టీఫెన్ రాజ్, డీకెన్ బోర్డు సభ్యులు స్మాలస్ రాజ్, దేవరాజ్, జార్జ్ బాబు, పాస్టర్ జగదీష్, సాంబశివరావు, సుధాకర్, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



జిల్లెడుగుంట నుంచి భక్తరపల్లికి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



అమరాపురంలో శనీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు



రొళ్ల శనేశ్వరాలయ ప్రాంగణంలో జ్యోతులతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



గుడిబండ: ఆంజనేయుడిని పూలతో అలంకరించిన దృశ్యం



రొళ్లలో శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



మహావిష్ణువు అలంకరణలో పేట వేంకట రమణుడు

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా తొలి శ్రావణ శనివారం పూజలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానంగా శనీశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో మూల విరాట్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు తదితర పూజలను చేశారు. మడకశిర పట్టణంలోని షిరిడీ సాయిబాబా, మిట్టబండ ఆంజనేయ, చంద్రమౌళీశ్వర, భోగిరామేశ్వర ,కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు

మడకశిరరూరల్: మండలంలోని జిల్లేడుగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవ మూర్తులను భక్తులు భక్తరహళ్ళి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వరకూ ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే నీలకంఠేశ్వరస్వామి, కల్లుమర్రి వీరకేతమ్మ, చందకచెర్లు ఆంజనేయస్వామి, జమ్మానిపల్లి లక్ష్మీనిడి మామిడమ్మ తదితర ఆలయాల్లో మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

గుడిబండ: మండలంలోని ఫళారం గ్రామంలో ఆంజినేయ స్వామికి శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మూలవిగ్రహానికి పంచామృతాభిషేకాలతో పాటు, తమలపాకు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న శనీశ్వరాలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు వేకువజామున సుప్రభాత సేవలు, నవగ్రహారాధన, కుంకుమార్చన, అభిషేకం, అంకురార్పణ తదితర పూజలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసువకుచ్చి స్వామికి సమర్పించారు అలాగే జీరిగేపల్లి అమ్మాజి, కొత్త పాళ్యం వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఉన్న శనీశ్వరస్వామికి అర్చకుడు నరసింహభట్టార్ సుప్రబాతసేవ,తైలాభిషేకం, నవగ్రహ పూజ, తదితర వాటిని నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అలాగే స్థానిక లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, తమ్మడేపల్లి ఆంజనేయస్వామి, చెరువు ఆంజనేయస్వామి ఆలయాల్లో దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హిందూపురం టౌన్: శ్రావణ మాసం మొదటి శనివారం పురస్కరించుకుని పట్టణంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవల అనంతరం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేషంగా అర్చనలు చేపట్టారు. పేట వేంకట రమణస్వామి ఆలయంలో స్వామిని మహావిష్ణు రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, విశేషంగా పూజలు జరిపారు.

కుక్కల బెడదతో ప్రమాదాలు



కుక్కలు అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం నుంచి పడిపోయిన వాహనదారులు

మడకశిర: పట్టణంలో కుక్కల బెడదతో రోజూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో పలువురు ద్విచక్రవాహనదారులు గాయపడుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే అమరాపురం–హిందూపురం ప్రధాన రోడ్డుపై కుక్కలు గుంపులుగా తిరుగుతుంటాయి. ఈ క్రమంలో వాహనాలకు అడ్డం వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటన శనివారం కూడా జరిగింది. కుక్కలు అడ్డం రావడంతో ద్విచక్రవాహనంలో చంటి బిడ్డతో వస్తున్న దంపతులు రోడ్డుపై కిందపడ్డారు. అయితే అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు.ఇలాంటి ఘటనలు రోజూ జరుగుతూనే ఉన్నాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని పట్టణవాసులు వాపోతున్నారు. పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో కూడా కుక్కల బెడద నివారించాలని కౌన్సిలర్లు కోరారు. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరారు.

దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేయాలి



పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని హొన్నంపల్లిలో కొన్ని రోజులుగా ఓ సామాజికవర్గాన్ని టార్గెట్ చేస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయాలని గ్రామ పంచాయతీ సర్పంచ్ మంజునాథరెడ్డితో పాటు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని మాచరాజనహళ్లికి చెందిన రాజు అనే వ్యక్తి హొన్నంపల్లికి వచ్చి తరచూ తాగిన మైకంలో గొడవలకు దిగుతున్నాడన్నారు. అతని చేష్టలతో విసిగిపోయినట్లు తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, స్థానిక రెడ్డి కులస్తులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు

ధర్మవరం అర్బన్: అరుణాచలం గిరి ప్రదర్శనకు ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు సదుపాయం కల్పించామని ఆర్టీసీ డీఎం సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీన పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, కాణిపాకానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 18న ఉదయం 6 గంటలకు ధర్మవరం డిపో నుంచి బస్సు బయలుదేరి వెళుతుందని పేర్కొన్నారు. రానుపోను చార్జీ రూ.1,400 నిర్ణయించామన్నారు. భక్తులు ముందుగానే ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 6303151302, 9959225859 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పాఠశాల భవనాన్ని నిర్మించండి

రొద్దం: మండలంలోని తురకలాపట్నంలో ప్రాథమిక పాఠశాల నూతన గదులు నిర్మించాలని మంత్రి సవితమ్మను గ్రామస్తులు కోరారు. శనివారం వారు మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యను విన్నవించారు. సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

నేడు ఆలయ కమిటీ సమావేశం

అమరాపురం: మండలంలోని గౌడనకుంట గ్రామంలో వక్కలిగుల సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన అన్నదమ్ముల సమావేశాన్ని ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. సమావేశానికి యాజమానులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.